# మంత్రాలకు శక్తి ఉందా?

జె.యు.బి.వి.ప్రసాద్

"న తద్భాసయతే సూర్యో, న శశాఙ్కో న పావకః
యద్గత్వా న నివర్తంతే, తద్ధామ పరమం మమ"

పదేళ్ళ భాస్కరం గొంతు చించుకుని, లేని పెంకు లెగిరి పోయేలా , భగవద్గీత పంచ దశాధ్యాయమైన పురుషోత్తమ యోగంలోని ఆరవ శ్లోకాన్ని బట్టీ కొడుతున్నాడు. ఎంత పెద్ద గొంతుతో చదివితే, అంత శ్రద్ధ వున్నట్లు లెక్క, వాడికి. వంటింట్లో వున్న తల్లికి వినబడాలనే కోరికతో, వరండాలోంచి గట్టిగా కేకలెడుతున్నాడు. అలా అరుస్తూ చదివే శ్లోకంలో ఒక్క ముక్కకీ కూడా అర్థం తెలియదు వాడికి. వాడికే కాదు, ఆ ఇంట్లో పెద్దాళ్ళకి కూడా తెలియదు. బయట ఉన్న పెద్దాళ్ళకి కూడా చాలా మందికి తెలియదు. అయినా సరే, ఆ సంస్కృత పదాలు చెవిన పడితే, ఆ ఇంట్లో వాళ్ళకీ, చుట్టుపక్కల వాళ్ళకీ ఒళ్ళు పులకరిస్తుంది తన్మయత్వంతో!

అది మూడు వాటాలున్న ఓ బ్రాహ్మణ కొంప. భాస్కరమూ, వాడి అక్కా, తల్లిదండ్రులూ ఒక వాటాలో ఉంటారు. నాలుగు సందుల అవతల ఉన్న గోపాల స్వామి గుడిలో ప్రతీ యేటా భగవద్గీత పోటీలు జరుపుతారు. అందులో పాల్గొనే పిల్లలందరూ , గుళ్లో వాళ్ళు చెప్పిన ఏదో ఒక అధ్యాయంలోని కొన్ని శ్లోకాల్ని అప్పజెప్పాలి. ఏ శ్లోకాలు అప్పజెప్పమంటారో తెలియదు కాబట్టి, పిల్లలందరూ మొత్తం అధ్యాయం అంతా కంఠతా పట్టేస్తారు. ఎవరు బాగా, రాగయుక్తంగా, తప్పుల్లేకుండా శ్లోకాలు అప్పజెబుతారో, వాళ్ళకి గుళ్ళో వాళ్ళు బహుమతులిస్తారు. ఎటొచ్చీ ఆ పోటీలో పాల్గోడానికి బ్రాహ్మణ, వైశ్య పిల్లలకి తప్ప వేరే వారికి అర్హత లేదు.

భాస్కరానికి ఇప్పటి వరకు ఏ యేడూ బహుమతి రాలేదు. ఆ యేడాదన్నా ఒక చిన్న బహుమతి సంపాదించాలని వాడి తాపత్రయం.

''ఇంకాస్త గట్టిగా, శ్రద్ధగా కంఠతా పట్టరా!' అంది వాడి తల్లి ఆ పక్కనించి వెళుతూ.

తల్లిని సంతోష పెట్టేద్దామని ఇంకా గొంతు పెంచాడు భాస్కరం. ఈ తతంగం అంతా చూస్తున్న వాడి అక్క ''ఆపరా నీ బడాయి! నీ అరుపులు వినలేక చస్తున్నాను. నేను పరీక్షలకి చదువు కోవాలి''. అని తిడుతూ, పక్క వాటా ఆవిడ ఏదో అంటుంటే ఆపేసింది.

''మా దాసీ దానితో మాట్లాడుతున్నాను. దాని మాటొక్కటీ వినిపించట్లేదు. కాస్త గొంతు తగ్గిస్తావా నాయనా ? '' అనంటూ పక్క వాటా ఆవిడ కొర కొరా భాస్కరం వేపు చూసింది.

బిక్క మొహం వేసి, అరుపులు ఆపాడు వాడు. లోపల్నించీ వాడి తల్లి చాలా విసురుగా అరిచింది. ''నువ్వు శ్లోకాలు గట్టిగానే చదువుకోరా! ఎవరడ్డం వస్తారో చూస్తాను, శూద్రాళ్ళతో కబుర్ల కోసం, పవిత్రమైన భగవద్గీత శ్లోకాలు చదవడం ఆపాలా ? ఏమిటీ చోద్యం ? ఇలాంటి అనాచారం ఎక్కడా చూడం'' అని.

ఆ కేకలకిపక్క వాటా ఆవిడ వెర్రి మొహం వేసింది ఏమనాలో తోచక.

తల్లి ప్రోత్సాహంతో మళ్ళీ లేని పెంకులెగిరిపోయేలా అరవ సాగాడు వాడు సంస్కృతంలో.

భాస్కరం తల్లి అసలు ఘోష పక్క వాటా ఆవిడ తన పిల్లాడిని అరుపులు ఆపమన్నందుకు కాదు. అసలు ఆవిడకీ, ఈవిడకీ పడదు. ఎప్పుడో దేనికో ఓ దానికి తగువు పెట్టుకుంటూనే ఉంటారు. ఆ పక్క వాటా ఆవిడకి అన్ని వాటాల వాళ్ళతోను తగవులే. ప్రతీ దానికీ నోరు పారేసు కుంటుంది.

అసలేం జరిగిందంటే, ఆ రోజు పొద్దున్న భాస్కరం తల్లి వంటింట్లో దేవుడి పూజ చేసుకుంటూ వుండగా, అకస్మాత్తుగా ఏదో వచ్చి మీద పడ్డంతో, ఒక్క సారిగా వులిక్కి పడింది. ఏమిటా అని చూస్తే, ఏముందీ నువ్వు గింజలు ! పక్క వాటా ఆవిడ ఆ వరండాలోంచి వెళుతూ, కిటీకీ లోంచి నువ్వు గింజలు భాస్కరం తల్లి మీదకి జల్లి, గబగబా వెళ్ళిపోయింది. అది భాస్కరం తల్లి చూడనే చూసింది.

''నీకేం మాయరోగం వచ్చిందే తల్లీ! శుభమా అని నేను పూజ చేసుకుంటూ ఉంటే, ఓర్వలేక , నీ శని నాకు అంటాలని నువ్వులు చల్లుతావా ? నాశనమైపోతావు'' అనంటూ అరిచింది భాస్కరం తల్లి.


''ఆ పని చేసింది నేను కాదు'' అంటూ ఇంకా పెద్ద గొంతుతో దిగింది ఆ పక్క వాటా ఆవిడ. నువ్వు గింజలతో మొదలైన పొట్లాట, ఎక్కడెక్కడికో వెళ్ళి, ఆ వేపు ఆరు తరాలనీ, ఈ వేపు మూడు తరాలనీ శాపనార్థాలు పెట్టి , అలిసిపోయి ఆగింది ఆఖరికి.

ఆ రామ రావణ యుద్ధాన్ని చూసిన భాస్కరం బిక్క చచ్చిపోయాడు. అసలే అర్భకుడు వాడు. అందులో కాస్త భయస్తుడు కూడా. ఎవరన్నా దెబ్బలాడుకుంటూ వుంటే చాలు, వీడికి కాళ్ళలో వణుకు పుట్టేస్తుంది.

''నువ్వులూ, శనీ'' అన్న మాటలు వాడి చిన్న మనసులో గునపాలు దింపాయి.

తుపాను తర్వాత ప్రశాంతత ఆవరించాక, తల్లి దగ్గరికి వెళ్ళి అడిగాడు, ''ఇప్పుడు మనకు శని పడుతుందా అమ్మా '' అని.

దానికి వాడి తల్లి ''మనకెందుకురా భయం ? నువ్వెళ్ళి ఆ తనికెళ్ళాయన్ని పిలుచుకు రా! ఆయన శాంతి చేయిస్తారు'' అంది ధైర్యంగా.



భాస్కరం పరుగున వెళ్ళి, తనికెళ్ళ శాస్త్రిని పిలుచుకు రావడం, ఆయన భాస్కరం తల్లి చేత మంత్రాలు చదువుతూ శాంతి చేయించడం, జరిగాయి. వెళుతూ, వెళుతూ, తన సంభావన తీసుకెళ్ళడం మర్చిపోలేదతను.

శాస్త్రి చదివిన మంత్రాల శక్తికి శని పారిపోయాడని గాఢంగా నమ్మాడు భాస్కరం. అప్పటికి వాడి మనసు శాంతించింది.

ఆ సాయంత్రం, పొద్దున్న జరిగిన నువ్వుల శాంతీ, మధ్యాహ్నం జరిగిన భగవద్గీత శ్లోకాల గొడవా ఎదురింటి వకీలు కృష్ణారావుకి చెప్పాడు భాస్కరం. వాళ్ళిద్దరికీ ఒక రకమైన స్నేహం ఉంది.

ఈ మూడు వాటాలున్న ఇంటికి ఎదురింట్లో వుంటాడు వకీలు కృష్ణారావు. వచ్చే పోయే క్లయింట్లతో ఆయన మహా బిజీగా వుంటాడు ఎప్పుడూ. వకీలుగా మంచి పేరుంది ఆయనకి. పేద వాళ్ళని డబ్బు కోసం పీక్కు తినడని, నలుగురూ చెప్పుకుంటారు. అలాగే నాస్తికుడిగా ఆయనకి చెడ్డపేరుంది కూడా. ఆ సందులో వున్న ఆడవాళ్ళందరూ, ''కృష్ణారావు, ఇంట్లో వున్న దేవుడి విగ్రహాలన్నీ వుప్పుటేట్లో కలిపేశాడనీ, అందుకే ఆయన భార్య లబో దిబో మంటుందనీ, భర్తకి అన్ని రకాల కూరలూ వండి పెట్టకుండా అస్తమానూ వేపుళ్ళతోనే సరి పెడుతుందనీ'' చెవులు కొరుక్కుంటూ ఉంటారు. ఆవిడకి చెప్పి లాభం లేదని ఆయన ఎప్పుడో గ్రహించేశాడు. నిజానికి నాస్తికుడైన ఆ వకీలు, తన భార్య చేసే పూజలకి ఏనాడూ అడ్డు వెళ్ళలేదు పాపం. తన నాస్తికత్వం తన దగ్గరే పెట్టుకుని, తన పిల్లలకి కాస్త నేర్పడానికి తహ తహలాడుతూ వుంటాడు. ఆయన భార్య అన్ని రకాల కూరలూ చెయ్యకుండా వేపుళ్ళతో పెట్టడానికి కారణం ఆవిడ బద్ధకం తప్ప మరోటి కాదు. ఆయన కోర్టు కెళ్ళగా చూసి, ఆయన భార్య ఆ పిల్లలకి ఆస్తికత్వం నూరి పోస్తూ వుంటుంది కుర్చీ లోంచి కదలకుండా. ఇక ఆ పిల్లలు ఎలా పెరుగుతారో కాలమే నిర్ణయిస్తుంది మరి ! అప్పటికి మటుక్కి, ఆ పిల్లలు ఆటల ధ్యాసలో పడి, తల్లిదండ్రులిద్దర్నీ పట్టించు కోకుండా తిరుగుతూ వుంటారు.


ఏ మాటకా మాటే చెప్పుకోవాలి! వకీలు కృష్ణారావు సందులో వున్న వారికి చేదోడు వాదోడుగా వుండటంతో, వారంతా ఆయన నాస్తికత్వాన్ని భరించి, సహించి, క్షమించి, ఆయనతో సఖ్యతగా వుంటూ వుంటారు.

ఓ రోజు ఓ సీనియర్ వకీలు, కృష్ణారావు నడిగాడు, ''మంత్రాలకి విలువే లేదంటారా ? మొన్నో పత్రికలో చూశాను. ఒకాయన, 'మంత్రాలకి శక్తి వుందా ?' అని వ్యాసాలు రాస్తున్నాడు. బోల్డు మంది మెచ్చు కుంటున్నారు. అంత మంది నమ్ముతున్న వాటిని మీరెలా కాదంటారు ? '' అని.

దానికి సమాధానంగా ఒక చిన్న ఉపన్యాసం ఇచ్చాడు కృష్ణారావు, ''ఆ వ్యాసాలు చదవలేదు గానీ, వాటి మీద పాఠకులు రాస్తున్న ఉత్తరాలు చదివాను. వాటిని బట్టి చూస్తే, వాళ్ళ నమ్మకాలతో, వాళ్ళ పరిమితుల్లో, వాళ్ళిష్టంవచ్చినట్టూ వాళ్ళుంటున్నారు. అందరికీ వాక్స్వాతంత్రం వుంటుంది కదా అని నేను పట్టించు కోలేదు. వాళ్ళంతా అవి అంత మూఢంగా నమ్మినట్టు అనిపించలేదు. కాస్త లౌక్యంతోనే నమ్మినట్టుగా అనిపించారు. పరలోక సుఖాలకి తాపత్రయ పడుతున్నారనే అనిపించింది. కానీ ఈ మధ్య, అటువంటి విషయాలని చాలా అమాయకంగా, పూర్తిగా నమ్మిన ఒకావిడ ఆ రచయితకు ఉత్తరం రాసింది. ''అత్తవారింట్లో చాలా కష్టాలు పడుతున్నానూ, ఆ కష్టాలు పోవడానికి ఏదన్నా మహా మంత్రం చెప్పండీ''అని బతిమాలుతూ, ఆర్ద్రంగా రాసింది. అందరి మెప్పుకోళ్ళకీ ఎగురుకుంటూ సమాధానాలిచ్చిన ఆ వ్యాస రచయిత, ఆ ఉత్తరానికి మాత్రం జవాబివ్వ లేదు. ఒకవేళ ఏదన్నా మంత్రం చెబితే, అది ఆవిడకి పని చేయకపోతే, ఆయన ఇరుక్కు పోతాడు కదా ? పత్రిక వాళ్ళు ఆ ఉత్తరాన్ని ఆ వ్యాస రచయితకి పంపిస్తా మన్నారు. ఆ స్త్రీ ఉత్తరం చూస్తే చాలా జాలేసింది. అటువంటి మంత్రాలన్నీ ఉంటాయని, ఇటువంటి చెత్త వ్యాసాలు చదవడం వల్ల అమాయకంగా నమ్మేసింది. ఇంక ఎవరన్నా మోసగాళ్ళు ఈవిణ్ణి మోసం చెయ్యడమే తరువాయి''

సీనియర్ వకీలు తల పంకిస్తూ ఏమీ అనకుండా ఉండి పోయాడు.

కృష్ణారావు అప్పుడప్పుడు భాస్కరం చేత ఏమన్నా చిన్న చిన్న పనులు చేయించుకుని,



చేతిలో చిల్లర పెడుతూ వుంటాడు. ఏమన్నా కొనుక్కోమని. అదీ వాళ్ళిద్దరి స్నేహం.


భాస్కరం చెప్పిన కధంతా విని ఫక్కున నవ్వాడు కృష్ణారావు.

'మీ అమ్మా వాళ్ళూ దెబ్బలాడుకోవడం వల్ల శాస్త్రి సంభావన సంపాదించి బాగు పడ్డాడన్న మాట! పోనీలే, పాపం ఆ పేద బ్రాహ్మడు ఈ రోజుకి కుటుంబానికి కాస్త సంపాదించుకున్నాడు'' అని అన్నాడు.

ఆయన మాటలు అంతగా అర్థం కాలేదు భాస్కరానికి.

''అదేంటండీ మావయ్య గారూ, అలాగంటారు ? నువ్వుల వల్ల మాకు పట్టబోయే శని శాస్త్రి గారి మంత్రాలతో పోయింది కదా ? '' అనడిగాడు ఆరాగా. వాడికి చాలా చనువు ఆయన దగ్గర.

''నువ్వు గింజల్తోనే శని పట్టేటట్టయితే, చెడ్డ వాళ్ళందరి మీదా కాస్త నువ్వు గింజలు జల్లేస్తే సరి! కోర్టులూ, శిక్షలూ, ఎందుకూ ? మంత్రాల్తోనే శని పోయేటట్టయితే, ఆ పేద బ్రాహ్మడు ముందుగా మంత్రాల్తో తన శని పోగొట్టుకుని డబ్బు బాగా సంపాదించవచ్చు కదా ?'' అన్నాడు కృష్ణారావు నవ్వుతూ.



ఆ మాటల్లోని తర్కం ఎంత మాత్రమూ ఎక్కలేదు భాస్కరం బుర్రలోకి. ఎటొచ్చీ కృష్ణారావు మంత్రాలకి శక్తి లేదంటున్నాడని మాత్రం అర్థం అయింది.

''అలా అనకండి బాబూ! కళ్ళు పోతాయి'' అంటూ అక్కణ్ణించి, చెంప లేసుకుంటూ పరుగెట్టుకుని వెళ్ళి పోయాడు భాస్కరం.

ఆ మూడు వాటాల ఇంట్లో అన్నీ అగ్గి పెట్టి లాంటి వాటాలు. మడీ, ఆచారాలే గానీ, శుభ్రం అన్నది లేదు ఆ వాటాల్లో వుండే కుటుంబాల్లో. దేవుడి మందిరం పక్కన అలమార్లో పెట్టిన పెద్ద పెద్ద ఆవకాయా, మాగాయా జాడీలు ఏడాది కొక్కసారి మాత్రమే కదుపుతారు. ఊరగాయలు పెట్టి నపుడు. పగలైతే భాస్కరం తల్లి మడి గట్టుకుని, ఊరగాయ తీస్తుంది జాడీల్లోంచి. ఎప్పుడన్నా రాత్రిళ్ళు అధరువుకి ఊరగాయ కావల్సి వస్తే , భాస్కరానికి 'చీకటి మడి' కట్టు కోవడం తప్పని సరయ్యేది. అంటే , వంటింటి తలుపు దగ్గరగా వేసి, చొక్కా, లాగూలు విప్పేసి దిశ మొలతో ఊరగాయ జాడీల్లోంచి ఆవకాయో, రెండూనో వేరే గిన్నెల్లోకి తీసి , మళ్ళీ బట్టలు కట్టుకోవడం. ఆ ఆవకాయ జాడీల పక్కన దుమ్ము దట్టంగా పేరుకు పోయి వుంటుంది ఎప్పుడూ.

సామానులు మూల మూలల్లో కుక్కడం, అక్కడ చెత్తంతా పేరుకోవడం, ఆ చెత్తకి బొద్దింకలు చేరడం, ఆ బొద్దింకల్ని తినడానికి తేళ్ళు రావడం, అన్నీ చాలా మామూలు విషయాలు ఆ వాటాల్లో. తేలు కనబడితే చాలు ఎంతో



ఉత్సాహంగా చెప్పులతోటీ, చీపుళ్ళ తోటీ చంపేస్తారు పిల్లలు కూడా. భయం లేకుండా. పగ సాధించడానికి అప్పుడో తే లూ, ఇప్పుడో తేలూ ఎవర్నయినా కుట్టడం, వాళ్ళు లబో దిబో మనడం కూడా మామూలు ఆ వాటా వాళ్ళకి.

ఆ రోజు ఓ చిన్న తేలు పిల్ల పోయి, పోయి భాస్కరం అక్కని కుట్టింది. అసలే ఆ అమ్మాయి చాలా సున్నితురాలు. ''ఏమ్మా ? '' అని ఎవరన్నా జాలిగా పలకరిస్తే చాలు, గుక్క తిప్పు కోకుండా ఏడిచేది. విషాద సినిమా చూస్తున్నంత సేపూ మాత్రమే కాక, ఆ సినిమా కథ తన స్నేహితులకు చెపుతూ కూడా ఏడిచేది ఆ పిల్ల.

అటువంటి పిల్లకి కాలి వేలి మీద చిన్న తేలు పిల్ల కుట్టింది. వెంటనే పెద్ద కేక పెట్టి శోకాలు మొదలు పెట్టింది ఆ పిల్ల. భాస్కరం పరుగున వచ్చి ఆ తేలు పిల్లని చెప్పుతో చంపేశాడు కసి తీరా. అంత మాత్రం చేత తేలు కుట్టిన చోట మంట తగ్గుతుందా ? అంతకంతకీ ఆ పిల్ల ఏడుపు పెరగ సాగింది. ఇంట్లో వాళ్ళూ, పక్కింటి వాళ్ళూ, మేడ మీద వాటా వాళ్ళూ అందరూ చుట్టూ మూగారు.

''కాలు విదిలించు, కాలు విదిలించు! తేలు విషం

దిగి పోతుంది'' అని సలహా ఇచ్చింది ఒకావిడ.

కానీ ఆ చిట్కా పని చెయ్యలేదు. అక్కంటే భాస్క రానికి ఎంతో ఇష్టం. ఆ తేలు తననే కుట్టేసినంత బాధ పడి పోతున్నాడు వాడు.

పక్కింటాయన వచ్చి ఆ పిల్ల కాలి పిక్కకి తన భుజం మీద ఉన్న గుడ్డ కట్టాడు గట్టిగా, తేలు విషం పైకెక్కకుండా. ఇంకొకావిడ తులసి ఆకులు నూరి, తేలు కుట్టిన చోట పట్టు వేసింది. అయినా పాపమా పిల్ల ఏడుపాపలేదు.

''మన మునిగింట వాళ్ళ బుచ్చికి తేలు మంత్రం వచ్చురా! అతని దగ్గరికి తీసుకెళదాం పిల్లని'' అని 'దివ్యమైన' సలహా ఇచ్చిందొకావిడ.

ఆ సలహా వినగానే భాస్కరానికి గుండె గొంతు లోకి వచ్చింది. ముకుళించిన వదనం వికసించింది. ఆ ఆలోచన అంత వరకు తనకు తట్ట నందుకు బాధ కలిగింది.

వాళ్ళందరూ ఆ పిల్లని పక్క సందులో వున్న మునిగింట వారింటికి తీసుకెళ్ళారు. వీళ్ళదృష్టం కొద్దీ వాళ్ళబ్బాయి ఇంట్లోనే ఉన్నాడు. ఆ అబ్బాయి చుట్టు పక్కల వాళ్ళకి ఇరుకు మంత్రాలూ, బెణుకు మంత్రాలూ, తేలు మంత్రాలూ వేస్తూ ఉంటాడు. డబ్బులేవీ తీసుకోడు. అవి పని చేస్తాయని అతనికీ, చుట్టుపక్కల వాళ్ళకీ నమ్మకం. ఆ మధ్య కృష్ణారావు భార్యకి ఎందుకో నడుం పట్టేస్తే, ఈ అబ్బాయి వెళ్ళి ఇరుకు మంత్రం వేసొచ్చాడు.

ఏవేవో మంత్రాలు చదివి, ''ఎవరు వారు ?'' అని అడిగాడు.

'ఇరుకు వారు' అని జవాబిచ్చింది కృష్ణారావు భార్య.

అలా ఓ నాలుగైదు సార్లు అడిగి, జవాబులు ఇప్పించుకుని ఇరుకు మంత్రం పూర్తి చేశాడా అబ్బాయి. కృతజ్ఞతతో ఓ అర డజను బంగిన పల్లి మామిడి పళ్ళు ఆ అబ్బాయికి ఇచ్చి పంపించిందా విడ. ఆ ఇరుకు మంత్రం మహిమవల్ల ఆవిడ నడుం నొప్పి మూడు రోజుల్లో తగ్గింది. మంత్రం లేకపోతే ఇంకెన్ని రోజులు పట్టేదో అని సంతోషించిందావిడ. ఆ సంగతి విని నవ్విన కృష్ణారావుని ఆవిడ పట్టించుకో లేదు. ''వుత్త నాస్తికుడు'' అని తిట్టుకుంది మనసులో.

మునిగింట వారబ్బాయి భాస్కరం అక్కకీ తేలు మంత్రం వేయ నారంభించాడు. ఏవేవో మంత్రాలు గొణుక్కుంటున్నాడు. మధ్యలో చిటికెలు వేస్తు న్నాడు. మళ్ళీ గట్టిగా మంత్రాలు గొణుగుతున్నాడు. ఆ మంత్రాలు పక్క వాళ్ళకి అర్థం అయ్యేలా చదివితే, అవి పని చేయవని వాళ్ళకున్న ఇంకో నమ్మకం. చుట్టూ వున్న అందరూ భక్తితో, నమ్మకంతో చూస్తూ నిలబడ్డారు. భాస్కరానికైతే ఒకటే కంగారు. అప్పటికీ వాడి అక్క ఏడుపాపలేదు. ''అదేంటీ ? మా అక్క నొప్పి పోలేదేం ? ఇంకా ఏడుస్తోందిగా!'' అని ఆత్రు తగా అడిగాడు భాస్కరం.

''మంత్రం వేయగానే పని చేసేస్తుందేవిటీ ? కొంత సమయం పడుతుంది'' అన్నాడా అబ్బాయి నమ్మకంగా.

అందరూ పోలో మంటూ ఏడుస్తున్న పిల్లని ఇంటికి తీసుకొచ్చారు. ఎంత సేపైనా పిల్ల ఏడుపా పదే!

''మునిగింటారబ్బాయి తేలు మంత్రం పని చేయ లేదేమోనర్రా!'' అంటూ భాస్కరం తల్లి తన అపన మ్మకాన్ని వెలిబుచ్చింది. కూతురి ఏడుపు చూడ్డం ఆవిడకీ కష్టంగానే ఉంది.

''అదీ నిజమే కావొచ్చు! అందరికీ మంత్రాలు సరిగా వచ్చి వుండకపోవచ్చు. బాగా వచ్చిన వారు కొంత మందే వుండొచ్చు'' అని దీర్ఘాలు తీసిందావిడ.

''అవును సుమా ! మొన్నా మధ్య కప్ప గంతుల వాళ్ళ పిల్లకి దెయ్యం పట్టినప్పుడు ఏం చేశారో తెలి యదూ ? ఈ మునిగింట వారబ్బాయి వేసిన మంత్రం పని చెయ్యకపోతే , మీ పక్క వాటా ఆయన చేత దెయ్యం మంత్రం వేయించారు. ఆయన ప్రతీ సోమవారం శివుడి గుడి కెళ్ళి అభిషేకం చేసి వస్తాడు. ఆయనకి తేలు మంత్రం కూడా వచ్చు!'' అని సబబు చెప్పాడు పక్కింటాయన.

పక్క వాటా ఆయన అంటే నువ్వు గింజలు విసిరి నావిడ భర్త. భాస్కరం తల్లి గతుక్కుమంది. ఆ రోజేగా ఆవిడతో దెబ్బలాడిందీ!ఏ మొహం పెట్టుకుని అడగ్గలదూ ? అలా ఆవిడ తటపటాయిస్తూ ఉంటే, పక్క వాటా ఆయన తన వాటా లోంచి బయటకు వచ్చాడు.

ఆయన్ని చూసి ''ఏమండీ! పిల్ల తేలు కుట్టి ఏడు స్తోంది ఓ మూడు గంటల్నించీ! కొంచెం తేలు మంత్రం వేస్తారా ? '' అని పక్కింటావిడ మొహ మాటం లేకుండా అడిగేసింది.

ఆ తంపుల మారావిడ భర్త మొహమాట పడి తేలు మంత్రం వేయడానికి ఒప్పుకున్నాడు. ''బ్రతికా నురా దేవుడా!'' అని నిట్టూర్చింది భాస్కరం తల్లి.

ఎవరివల్ల నన్నా అక్కకి నొప్పి తగ్గితే చాలని చూస్తున్నాడు భాస్కరం. అయితే గంటలు గడిచే కొద్దీ పిల్ల ఏడుపు తీవ్రత తగ్గుతోందని ఎవరూ గమనిం చడం లేదు.

ఇంట్లోకి వెళ్ళి, స్నానం చేసి, మడి బట్టలతో విభూతి రాసుకుని బయటకు వచ్చాడు తంపుల మారావిడ భర్త. అందరూ ఆయన కేసి ధన్వంతరిని చూసినట్లు చూశారు. ఆయన తేలు మంత్రం వేయ నారంభించాడు.

ఈయన కూడా ఒక్క పదమూ ఎవరికీ అర్థం కాకుండా గట్టిగా గొణగసాగాడు. మధ్య మధ్యలో భుజం మీదున్న తుండు గుడ్డ తీసి పిల్ల కాలి మీద విదిలిస్తున్నాడు. రెండడుగులు వెనక్కేసి మంత్రం చదివి, ముందుకి ఓ గంతేసి తుండు గుడ్డతో పిల్ల కాలిమీద దులిపాడు. ఆయన గెంతులకి ఈ పిల్ల కొంచెం ఏడుపాపి , కాస్త నవ్వింది. అందరి మన సులూ శాంతించాయి. మొత్తానికి తేలు మంత్రం వేయడం పూర్తయింది. ఒకసారి కాస్త నవ్వాక, మళ్ళీ ఏడుపందుకుంటే బాగోదని, ఆ పిల్ల వూరుకుంది. కానయితే ఇంకా దుఃఖ మొహం తోనే ఉంది. ఆ రోజంతా తల్లి చెయ్య బోయే గారాబానికి ఆ అమ్మాయి మనసు గంతు లేస్తూనే ఉంది.

ఆ మర్నాడు పొద్దున్న భాస్కరం కృష్ణారావుకి కథంతా చెప్పాడు చాలా ఉద్వేగంగా! చివరికి తేలు మంత్రం ఎంత గొప్పగా పని చేసిందో కూడా వివరిం చాడు. నవ్వు మొహంతో విన్నాడు కృష్ణారావు ఆ కథంతా. చివరకి,

''చిన్న తేలు పిల్ల కుట్టిన అన్ని గంటలకి నొప్పి, మంటా తగ్గవా ఏమిటీ ? వాటికే మంత్రాలూ, గాడిద గుడ్డూ అని ఎగురుళ్ళు ఎందుకూ ? అయినా తేలు కుడితే డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళాలని తెలియదూ ? ఒక రచయిత సోదరి తేలు కుట్టి చని పోయిందట. కొన్ని తేళ్ళు చాలా ప్రమాదకరమైనవి. మాట్లాడితే తేలు మంత్రం! బొత్తిగా బుద్ధి లేదు మీ అందరికీ. మీ పక్క వాటా ఆయన మీద ఓ పెద్ద తేలు పడేసి చూస్తే సరి! మంత్రం చెప్పుకుంటాడో, డాక్టరు దగ్గరకి పరుగె డతాడో తెలిసేది. చాలా మూర్ఖంగా ఉన్నారు మీరం దరూ!'' అని కేకలేస్తూ నాస్తిక ప్రవచనాలు చెప్పాడు. ఆ మాటలు భాస్కరానికి అర్థం అయీ, అవనట్టుగా వున్నాయి. పెద్ద వాళ్ళ బుర్రలోకే ఎక్కని విషయాలు, ఆ పిల్లాడి బుర్రకేం ఎక్కుతాయి ? తరతరాలుగా వున్న మూఢ నమ్మకాల్లోని మూర్ఖ జ్ఞానంతో ఆ



## అసిన్ ప్రేమలో పడిందా?

టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకొని, బాలీవుడ్‌లో కాలం కలిసి రాక ఖాళీగా కూర్చున్న అసిన్ ఓ హీరోతో ప్రేమలో పడిందన్న వార్తలు బాలీవుడ్‌లో గుప్పు మంటున్నాయి. నిన్న మొన్నటి దాకా ప్రియాంకా చోప్రా చుట్టూ తిరిగిన షాహిద్ కపూర్ ఇప్పుడు అసిన్ నామ జపం చేస్తున్నాడని పలువురు అంటున్నారు. షాహిద్, అసిన్ కలిసి ఇటీవల ఓ యాడ్‌లో నటించారట! అప్పటి నుంచే వీరిద్దరి మధ్యా స్నేహం బలపడిందని సమాచారం! ఈ వార్తలను అటు షాహిద్, ఇటు అసిన్ ఖండించకపోవడంతో ప్రియాంకచోప్రా వీరిద్దరి మీద అగ్గిమీద గుగ్గిలం అవుతోందట! ఈ విషయమై ప్రియాంక అసిన్‌కు ఫోన్‌లో వార్నింగ్ కూడా ఇచ్చిందని అంటున్నారు.

పిల్లాడి బుర్ర మూసుకుపోయింది.

అయితే, ఎప్పట్లా, '' ఈ వకీలు గారికేం తెలియదు'' అని అనుకోకుండా, ఆయన చెప్పినవే ఆలోచిస్తూ ఇంట్లోకి వెళ్ళాడు.

కొన్ని రోజులు గడిచాయి.

రోజులాగే ఆ రోజూ స్కూలుకెళ్ళాడు భాస్కరం. రోజులా కాకుండా ఆ రోజు స్కూలుకు ఒక ముఖ్య అతిథి వచ్చాడు. అదెవరో కాదు, భాస్కరం సహాధ్యాయి ఉపాధ్యాయుల వారబ్బాయి, కామేశ్వరశాస్త్రి. వాణ్ణందరూ శాస్త్రీ అనే అంటారు. కానీ తరగతిలో వాడికి దగ్గర్లో కూర్చునే పిల్లలందరూ 'స్వామీ' అని అంటారు. ఎందుకంటే వాడికి బోలెడు మంత్రాలొచ్చు. వాడి తండ్రి వాడికి చాలా చిన్న తనం లోనే ఉపనయనం చేసేశాడు. జంధ్యం వేసేశారు. చిన్న పిలక కూడా పెట్టించాడు. తనతో పాటు పౌరోహిత్యానికి తీసుకెళుతూ, ఎన్నో మంత్రాలు నేర్పిస్తున్నాడు. శాస్త్రి ఇప్పుడు సత్యనారాయణ స్వామి వ్రతాలు చేయించే అర్హత సంపాదించేసుకున్నాడు. ఎప్పుడో ఖాళీ దొరికినప్పుడు మాత్రం స్కూలుకు వస్తాడు. వచ్చినప్పుడల్లా వాణ్ణి దేవుణ్ణి చూసినట్టు చూస్తారు వాడి చుట్టూ వున్న పిల్లలు. తరగతి ఉపాధ్యాయులు కూడా, ''ఎందుకన్నా మంచిది, మంత్రాలొచ్చిన వాడు'' అని వాణ్ణి కాస్త గౌరవంగానే చూస్తాడు.

ఆ ముఖ్య అతిధికి ఒకరిద్దరు పిల్లలు కాళ్ళకి దణ్ణం కూడా పెట్టేశారు. శాస్త్రి గంభీరంగా ఆ పిల్లలని ఆశీర్వదిస్తున్నట్టు ఏవో మంత్రాలు గొణిగి, చేయెత్తి వాళ్ళ నెత్తి మీద పెట్టాడు. భాస్కరానికి వాడి మీద గురీ, గౌరవమూ, నమ్మకమూ ఉన్నాయి. ఎటొచ్చీ, కాళ్ళకి దణ్ణం పెట్టక్కర్లేదులే అనుకున్నాడు. వంగి దణ్ణం పెట్టకుండా దూరంగా నించున్నాడు. అదే వాడు చేసిన తప్పు! అది శాస్త్రికి ఆగ్రహం కలిగించింది.

''ఏమిరా భాస్కర శర్మా? ఎందుకంత అహంకారం? ఇదిగో నేనిస్తున్న శాపం. ఈ రోజు సాయంత్రం ఆరు గంటలకల్లా నీ కళ్ళు పోవు గాక! నా శాపానికి తిరుగులేదు!'' అంటూ చెయ్యెత్తి శాపం పెట్టి, ఏవో మంత్రాలు చెప్పేశాడు ఆ మంత్రాల వాడు.

భాస్కరం గుండెల్లో రాయి పడి పోయింది. ఏమనాలో, ఏం చెయ్యాలో ఏమీ తోచలేదు వాడికి.

అప్పటికి కొంచెం తేరుకుని ''స్వామీ! స్వామీ! మీ శాపాన్ని వెనక్కి తీసుకోండి స్వామీ!'' అని బతిమాలాడు. కానీ ఆ 'స్వామి' కరుణిస్తేగా! ''నా శాపానికి తిరుగులేద''ని మొండి కేసుక్కూర్చున్నాడు స్కూలు వదిలేదాకా. ఏడుపు ముఖంతో ఇంటికి మళ్ళాడు స్కూలవగానే భాస్కరం.

పుస్తకాల సంచీ బల్లమీద పడేసి, వీధి గుమ్మం మీద కూర్చుని ఏడవసాగాడు భాస్కరం.

''ఎందుకురా ఏడుస్తున్నావు ? ఎవరన్నా కొట్టారా?'' అని ఆరా అడిగింది వాడి అక్క.

అప్పటికే వాడి తల్లి అక్కడికి చేరింది. కాస్త ఏడుపాపి, జరిగిందంతా చెప్పి, ''ఆరు గంటల కల్లా నా కళ్ళు పోతాయి బాబోయ్!'' అంటూ మళ్ళీ ఏడుపు లంకించుకున్నాడు.

వాడి అక్కకి నవ్వాగలేదు. ''పోరా పిచ్చి వెధవా! నీ పిచ్చి కబుర్లూ, నువ్వూనూ!'' అని తీసి పారేసింది విషయాన్ని.

వాడి తల్లికి కూడా నమ్మకం కలగలేదు ఆ శాపం మీద. ఈ రోజుల్లో శాపాలూ ఉంటాయా, పని చేస్తాయా అనుకుంది. మళ్ళీ ఏవన్నా అందామంటే, వాడికి నేర్పించిందానికి వ్యతిరేకంగా వుంటుందని వూరుకుంది. అప్పటికీ,

''ఊరుకోరా! ఏడవకు! దేవుడికి దణ్ణం పెట్టుకో! ఆ శాపం పని చేయకుండా పోతుంది'' అని నచ్చ జెప్పింది. వాడు ఒప్పుకుంటేగా! ఆ శాపాన్ని గట్టిగా నమ్మింది వాడొక్కడే.

''అమ్మా ! కళ్ళు పోతే పోతాయి గానీ, రేపు స్కూలుకెళ్ళక్కర్లేదన్న '' ఆలోచన వాడికి కొంచెం సంతోషం కలిగించింది. సాయంత్రం చప్పున ఐదున్నర దాటింది. భాస్కరం కళ్ళని తడిమి చూసుకున్నాడు. కళ్ళు మూస్తూ, తెరుస్తూ చూశాడు. కాస్సేపు, ''కళ్ళు పోయినా ఫరవాలేదేమో''అని కూడా అనిపించింది వాడికి. గడియారం దగ్గరే నించున్నాడు. కళ్ళు మూసుకున్నాడు. కాస్సేపటికి తెరిచాడు. గడియారం వేపు చూశాడు. ఆరు దాటి రెండు నిమిషాలు. కళ్ళు కనపడుతున్నాయి.

''అమ్మా, కళ్ళు కనబడుతున్నాయి, కళ్ళు కనబడుతున్నాయి!! అక్క కనబడుతోంది, రోడ్డు మీద వాళ్ళు కనబడుతున్నారు'' అని సంభ్రమంగా అరిచాడు. ఆరు మీద పది నిమిషాలు. సంతోషంతో వీధి వేపు చూశాడు. శాపం పెట్టిన శాస్త్రి సైకిలు తొక్కుకుంటూ వాడింటి ముందరకి వచ్చాడు. శాపం పెట్టిన విషయం శాస్త్రెప్పుడో మరిచిపోయాడు.

వాణ్ణి చూడగానే, ''ఆరు గంటలయిందిగా ? నా కళ్ళు పోలేదుగా ?'' అని భాస్కరం అడిగాడు శాస్త్రిని.

శాస్త్రి ఒక్క సారిగా ఖంగు తిన్నాడు. అప్పుడు గుర్తొచ్చింది వాడికి తన శాపం సంగతి.

''నీ గడియారం తప్పు. ఆరింకా కాలేదుగా!'' అన్నాడు శాస్త్రి. వాడూ తన శక్తిని నమ్ముకున్నాడు.

''ఏమవుతోందీ?'' అని తనలో తనే ఆశ్చర్యపోయాడు.

భాస్కరం తల్లీ, వాడి అక్కా శాస్త్రి వేపు చుర చురా చూశారు.''మా పిల్లాణ్ణి కష్టపెడతావా'' అన్నట్లు.

''ఏమయ్యా, నీకు దణ్ణం పెట్ట లేదని మా పిల్లాడికి శాపం పెడతావా ? '' అంది తల్లి కోపంగా.

''అబ్బే లేదండీ! నేను శాపం తిప్పగలను, చూడండీ! అనంటూ చెయ్యి తిప్పాడు.

వంటింట్లో పని గుర్తుకు రావడంతో భాస్కరం తల్లి లోపలకి వెళ్ళింది. వాడి అక్క తల్లిని అనుసరించింది.

స్థాన బలిమితో కాస్త ధైర్యం వచ్చింది భాస్కరానికి.''ఇప్పుడేమంటావు ?'' అన్నట్టు చూశాడు శాస్త్రి వేపు.

''అది కాదురా! నువ్వు మంచి వాడివే. ఇదిగో, నీకు శాప విమోచనం ఇస్తున్నాను'' అంటూ సైకిలికి స్టాండువేసి, ఏవో మంత్రాలు గొణిగాడు శాస్త్రి. అప్పటికి భాస్కరం మొహం వికసించింది. ఇంకాగకుండా సైకిలు మీద తుర్రు మన్నాడు శాస్త్రి.

సంతోషంగా ఎదురింటికెళ్ళి కృష్ణారావుకి సమాచారం అంతా అందజేశాడు భాస్కరం. కృష్ణారావు వాడి వేపు జాలిగా చూశాడు.

''శాస్త్రి శాపం పెట్టింది ఆరు గంటలకి నీ కళ్ళు పోవాలని. ఆ సమయంలో నీ కళ్ళు పోలేదు. తరవాత కొన్ని నిమిషాలకి శాప విమోచనం ఇచ్చాడు. పోనీ కళ్ళిక పోవని శాప విమోచనం కల్పించాడు. అదంతా నమ్మి నువ్వు సంతోషంగా ఉన్నావు'' అని అన్నాడు కృష్ణారావు కాస్త దిగులుగా.

ఎంతో అంధకారంతో మూసుకుపోయిన వాడి బుర్రలోకి అతి కష్టంమీద ఒకే ఒక చాలా చిన్న కాంతి కిరణం ప్రవేశించింది. అది ఎక్కువగా వెలిగి ప్రకాశిస్తుందో, లేక త్వరలోనే ఆరిపోతుందో కాలమే తెలియజేస్తుంది.

ఎప్పటిలా, ''మీరెప్పుడూ ఇంతే'' అనంటూ వెళ్ళిపోకుండా, అక్కడే నించుని, ''అయితే మంత్రాల శాపాలు పని చెయ్యవంటారా మావయ్యగారూ ? '' అని ఆత్రంగా అడిగాడు భాస్కరం.

కృష్ణారావు మొహం విప్పారింది.''కూర్చో'' అన్నాడు.

*

(jubv@yahoo.com)


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట, హైదరాబాద్. 500 073.
ఫోన్: 040-23747777 , 9391999999



FREE online Registration & Free search
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | |
|---|---|
| అమీర్‌పేట | నెల్లూరు |
| కూకట్‌పల్లి | తిరుపతి |
| దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు |
| విజయవాడ | (చెన్నయ్) టి.నగర్ |
| గుంటూరు | బెంగుళూర్ |
| తెనాలి | సేలం |
| విశాఖపట్నం | మధురై |
| రాజమండ్రి | వెల్లూరు |
| కాకినాడ | తిరుచి |
| ఖమ్మం | పాండిచ్చేరి |
| ఒంగోలు | ఈరోడ్ |
| | ఏలూరు |

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.